# చేదునిజం

గోడ గడియారం ఠంగున మ్రోగింది. ఉలిక్కిపడి తల ఎత్తి చూసింది. తొమ్మిదిన్నర అని చూడగానే, వడివడిగా పీట, కంచం పెట్టి, మరగబోతున్న చారువంక విసుగ్గా చూచి, కుంపటి [illegible]సర సాగింది విసురుగా. అప్పటికే రెండుసార్లు వంటింట్లోకి తొంగిచూచి, నిట్టూర్చి, నీళ్ళు పోసుకునేందుకు దొడ్లోకి వెళ్ళాడు మధుసూదనం.

కంచంముందు కూర్చున్నాక, మౌనంగా పదార్థాలు వడ్డించి కిటికీకి పక్కగా నిలబడి పోయింది పద్మ. పక్కింటి వాళ్ళింట్లోంచి మృదుమధురంగా వినవస్తున్న సంగీతం గోడలుదాటి మనసును పరవశింపచేస్తోంది.

“అన్నం ఆరిపోతూన్నా, నెయ్యివెయ్య లేదు ఏమిటా పరధ్యాన్నం” అని విసుగ్గా రాబోయిన మాటలు అతని పెదవి దాటలేదు. ఆమె పరధ్యానాన్ని చూచినప్పుడల్లా ఏదో తెలియని భావన అతని మనసులో మెదులుతూనే వుంటుంది. తను స్వార్థంతో తన అసమర్థతతో అంటగట్టిన ఆ పరధ్యానాన్ని విసుగుదలతో తీసిపారెయ్య లేడు.

సంగీతంలో మాధుర్యాన్ని అర్థం చేసుకున్న ఆమె హృదయం, సప్తస్వరాలకు మృదుత్వాన్ని చిందించే ఆమె కంఠం, స్వరాలలో గమనికలు రాగాలలో సొంపును వినేందుకు అలవాటు పడిపోయిన ఆమె చెవులు - వినిపించే సంగీతాన్నితప్ప మరేమీ వినలేవు.

పక్కింటి రేడియో నుండి వీనుల విందుగా వినవస్తూన్న కీర్తన భజరే గోపాలం- భజగోపాలం- భజితకుచేలం- భువనారాగం- భోగశరీరం- ఎంతచక్కని వర్ణన ఎంత కమ్మని రాగం?

అందులో ఆ పాడేదెవరో తెలుసుకునే ఆ పాట వింటున్నంతసేపు కలిగే ఆనందం. ఉద్వేగం అడుగున ఏదో అనుభూతి, అందిన ఫలాన్ని అవలీలగా విడుచుకొని చేయిజారిన అవకాశాన్ని మరువలేక. తృప్తి పడలేక విడచేనిట్టూర్పు!

భర్త ఆఫీసుకు వెళ్ళంగానే వంటిల్లు సర్దుకుని పిల్లలకి నీళ్ళుపోసి వాళ్ళతో ఆడుకుంటూ కూర్చుంది. మనిషి పిల్లల మధ్య వున్నా, దృష్టి వీధి వైపువున్నా మనసు ఎక్కడో. ఎక్కడెక్కడికో వెళ్ళిపోతూంది.

ఎంతసేపు వీధివైపు చూచినా, పోస్టుమాన్ జాడేలేదు. ఆడుకుంటున్న బాబు కళ్ళు నులుముకుంటూ ఏడవడం మొదలు పెట్టాడు. వెంటనే లేచి చాపమీద పడుకో పెట్టి జోకొట్టసాగింది. ప్రొద్దుట విన్న పాట మనసులో అలా మ్రోగుతూనే వున్నది. ఆ గానంలో ఎన్ని మధుర స్మృతులు మెదులుతాయో!

తను మొదటిసారి కచేరీ చేసినప్పుడు యీ రాగం ఆలాపించింది. మాష్టారుని అడిగి మరీ చెప్పించుకుంది. ఆ రాగంలో యింకో రెండు కీర్తనలు. ఆ కచేరీలో ఎదురుగాసభలో అమ్మా నాన్న ముఖం నిండా గర్వం నింపుకుని తనవంకే చూసే చూపు- ఏనాడు గుమ్మం కదలని అమ్మ ఆనాడు తనపక్క కూర్చున్న వారందరి తోనూ ప్రత్యేకంగా ఆ పిల్ల మా పిల్లేనండి అని చెప్పుకుంటూ మురిసిపోయిన అమ్మ చూపు తనెలా మరవగలదు?

తన సరదా తగినంత ప్రోత్సాహం యివ్వకుండా అమ్మా, నాన్న ఆరోజే అడ్డు పెడితే తనకీ బాధ వుండేదికాదేమో యీ రోజు!

ఆ రోజు... ఎదురింటి ప్లీడరుగారి అమ్మాయి లలితకు మొదటిసారిగాసంగీతం చెప్పడానికి వచ్చారు మాష్టారు. పాఠం చెప్పి. ప్లీడరుగారి కోరికపై రెండు కీర్తనలు పాడి వెళ్ళారు,

అంత చక్కగా పాడగలిగే వాళ్ళు ఎంత అదృష్టవంతులో. అలాంటి అదృష్టం తనకు ఏనాడైనా పడుతుందా! రాళ్ళను కరిగించే ఆ గానంలో ఎలాంటి బాధ లయినా మరవచ్చు అనుకుంది. కాని. ఆ గానమే యీనాడు తనలో మానని గాయమై మిగిలింద.

ప్రతి సాయంత్రం వీధి గుమ్మంలో కూర్చునేది ప్లీడరు గారమ్మాయి పాట వినాలని! అమ్మ ఎప్పుడూ కోప్పడేది, 'వీధి గుమ్మంలో ఆ కూచోడమేమిటే! అంటూ.

వారం రోజులుగా రోజూ వింటున్న స్వరాలు సన్నగా పాడుకుంటోంది గోపికి నీళ్ళుపోస్తూ. అప్పుడేదొడ్లోకివచ్చిన నాన్న తన పాట విన్నట్లున్నారు. ఆ సాయంత్రం అమ్మతో అంటూంటె వినిపించింది. వినికిడితోనే యింత చక్కగా పాడుతోంది అమ్మడు. దానికి నిజంగానే నేర్పిస్తే ఎంత చక్కగా పాడుతుందో!” అన్నారు.

“కాని నెల నెలా అంతపోసి మనం చెప్పించవద్దూ,” అంటోంది అమ్మ నిరుత్సాహంగా.

ఆ మర్నాడు ఇంట్లో ఎవరికి చెప్పకుండానే మాష్టారిని అడగటానికి వెళ్ళారు నాన్న. ఆ రాత్రి అమ్మతో చెప్తూంటే తన ఆనందం పట్టలేకపోయింది.

“మా అమ్మాయి సంగీతమంటే శ్రద్ధ కనబరుస్తోంది. అందరూ ఇచ్చినంత ఇచ్చుకోలేము. మీకు తీరికవున్న సమయంలో కొద్దిసేపు మా అమ్మాయికి కూడా నేర్పగలుగుతారేమోనని అడగటానికి వచ్చాను” అన్నారు నాన్న.

“మీ అమ్మాయిని రోజూ చూస్తూనే వున్నాను గుమ్మందగ్గర, పాఠం చెప్పడానికి వచ్చినప్పుడు. అలాగే చెప్తాను.” అన్నారు మాష్టారు.

ఇంక తన ఆనందం పట్ట పగ్గాలు లేకుండా పోయింది, తనుకూడా సగీంతం నేర్చుకోబోతుంద. తను కూడా పాడగలదు పదిమందిలో....

పదకొండవ ఏట మొదలయిన తన పాటకు ఏ ఆటంకం లేకుండా సాగిపోయింది. సరళీస్వరాలతో ఆరంభమయిన సంగీతం తన సాధనతో కన కంఠంలో సప్తస్వరాలను పలికించగలిగింది. పాఠం మొదలుపెట్టిన రోజు మాష్టారు చెప్పారు. “తెల్లవారు ఝామున సాధన చెయ్యమ్మా, చక్కగా పాడగలుగుతావు.”

అది మొదలు తను ఏనాడు సాధన మానలేదు. అమ్మతో చెప్పింది ఆరోజే.

"తెల్లారకట్ల లేవమ్మా. పాఠం పాడాలి." అంటూ.

పిచ్చిపిల్లా! యిప్పటినుంచి అక్కర్లేదమ్మా. యింకా కొంతకాలం పోనీ యాక." అంది. కాని తను మాత్రం మానలేదు. తన శ్రద్ధచూచి మాష్టారు కూడా శ్రద్ధగా నేర్పేవారు. రోజులుగడిచిపోయాయి. యిదివరకు అంతంత మాత్రంగా శ్రద్ధ చూపిస్తున్న చదువు పూర్తిగా వెనకబడిపోయింది. సమయం దొరికినప్పుడల్లా సంగీతం సాధన చేసుకోవడంలో గంటలు, గంటలు గడిపేది. ఎప్పుడయినా కాస్త చదువుకోమని కోప్పడే అమ్మా నాన్న కూడా అశ్రద్ధ చేశారు. దానితో తన చదువు ఆరవ క్లాసుతోనే ఆగిపోయింది. ఓ సారి అమ్మ కూడా అంది.

"బొత్తిగా దాని చదువు పట్టించుకోవడం మానేశావు. ఈ రోజుల్లో చదువులేకపోతే ఎలా" అని.

"దాన్ని పాడుకోమంటునే. పాడుతోందంటావా? దానికి చదువుమీద శ్రద్ధ లేదు. శ్రద్ధలేని చదువు వంటబట్టదు. కానియ్. దానికి ఏది ప్రాప్తమో అదే నవుతుంది." అన్నారు నాన్న

అదేమిటో మాష్టారు ఒక్కసారి నేర్పంగానే తనకు పట్టుబడిపోయేది. దానితో మాష్టారు కూడా ఉత్సాహంగా నేర్పసాగారు. ఆయన తరుచు అక్కడక్కడ తనని గురించి చెప్తూవుండేవారు కూడా.

ఓసారి ఎదురింటి ప్లీడరుగారి భార్య మాష్టారుతో అంటూంటే వింది. మా పిల్లల కంటే వెనక మొదలుపెట్టారు. యిప్పుడే వర్ణాలు ప్రారంభించారు ఆ పిల్లకి. మా పిల్లలకు కాస్త శ్రద్ధగా చెప్పండి," అంది.

"నాదేం వుందమ్మా. మన అమ్మాయిలు తగినంత శ్రద్ధపెట్టి యింట్లో పాడరు. సంగీతం ఒకరు చెప్తే వచ్చేదుందా, అమ్మా! మీకు తెలియనిదేముంది?" అన్నారు వ్యవహారికంగా. పెద్దింటి పాఠాలు పోగొట్టుకోవడం ఆయనకు యిష్టంలేదు.

ఆ కారణంగానో ఏమో అమ్మతో మాటలు కూడా తగ్గించుకుంది ఆవిడ

తన కెంతో కాలంగా వీణ నేర్చుకోవాలని సరదాగా వుండేది. కాని మాష్టారు ఏకకాలంలో వాయిద్యాలమీద నేర్పే పద్ధతి లేక, కావాలంటే ఆయనకు తెలిసినవాళ్ళ చేత నేర్పిస్తానన్నారు. కానివీణ ఖరీదువిన్న రోజు తన కోరిక నిట్టూర్పైపోయింది.

ఆరోజు... ఆరోజు మాష్టారు బాగా ఆలస్యంగా వచ్చారు. చూచి, చూచి యిక ఆపూటకు రారేమోననిపేసిన చాపా శృతి పెట్టె లోపల పెట్టేసింది. తీరావాకిట్లోకి ఆయన్ని చూడంగానే చాప తేవడానికి లోపలకు వెళ్ళబోతున్న తన్నిపిలచి వద్దమ్మా! ఇవాళ పాఠం చెప్పడానికి రాలేదు. వచ్చేనెలలో జరుగబోయే త్యాగరాజు వుత్సవాలలో నీచేతకచేరీ చేయిస్తాను. నీ పేరిచ్చి వచ్చాను ఇవాళ," అన్నారు.

ఆనందంలో మతిపోయింది. భయంతో వళ్ళు జలదరించింది. అంత మందిముందు వేదికమీద కూర్చుని.... ఆ రాత్రి యిక నిద్రపట్టలేదు. ఎన్నాళ్ళగానోవున్న కోరిక. పదిమందిలో కూర్చుని రాగ, తాళాలతో పాట పాడగలిగే అదృష్టం. నిజంగానే

**చెరుకూరి రమాదేవి**

తను పాడగలదా! అంత మందిలో, ఒక్కక్షణం మనసంతా బరువెక్కింది. కుతూహలం, ఎల్లా తెలియని భావాలతో పులకరించింది.

అది మొదలు కచేరి చేయవలసిన రోజువరకు సంగీతమే తనువుకు సర్వస్వంగా సాధన చేసింది.

కచేరీకి మూడురోజుల ముందు వయొలిన్, మృదంగంవాయించేవారినితీసుకువచ్చి వాళ్ళతోపాటు పాడించి, వాళ్ళతో ఎలా కలవాలో ఎక్కడ ఆపాలో అన్నీ అర్థమయ్యేలా వివరించారు మాష్టారు.

కచేరీరోజు దగ్గరకు వస్తున్న కొద్దీ తనలో ఏదో ఆతృత, సంకోచం నిలవనీయకుండా చేయసాగాయి.

ఆ రోజు కచేరికోసం నాన్న చుట్టుజరి పరికిణిఓణీ తీసుకువచ్చారు. అవి చూచేదాకా, సభకు కట్టుకువెళ్ళేందుకు అనువయిన బట్టలు కూడా లేవన్నసంగతి గుర్తుకయినా రాలేదు,

కొత్తబట్టలు కట్టుకుని అమ్మ, నాన్నకు నమస్కరించి వెడుతూంటే అమ్మ పిలచింది. "పదిమందిలో పాడటానికి భయపడకు. ఎవ్వరూ లేరనుకో, మాష్టారిముందు పాడుతున్నట్లే పాడెయ్యి." అంటూ ఏదో తనకు తోచింది చెప్పింది.

మాష్టారు కూడా చెప్పారు, పాట పాడేటప్పుడు ప్రేక్షకులవంక చూడవద్దని, యింట్లో సాధన చేస్తున్నట్లే అనుకోమని- యింకా - ఏవో ఏవో - అన్నిటికి బుర్ర వూపింది, కాని ఒక్కటి తల్లోకి దూరలేదు.

పందిరి నిండుగా సభికులు. అందులో ఎంతోమంది పేరు ప్రఖ్యాతులు పొందిన విద్వాంసులు వున్నారన్న భావన రాగానే అంతవరకు పొంగిపోతూన్న మనసు భయంతో కృంగి పోసాగింది. తను ఏనాడైనా వారందరిలా పాడగలనా? తన సంగీతంతో ఒక్కరినయినా తన్మయపరచగలనా. సంగీత జ్ఞానానికి అది నిదర్శనం- కాకపోయినా- ఆ భావన కలిగించే తృప్తి సంతోషం - తన మనసులో ఆలోచనలు సాగిపోతూనే వున్నాయి.

యింతలో మైకులో "పద్మావతి" అన్న పేరు వినంగానే తన వళ్లు జలదరించింది. తడబడే కాళ్ళతో మెల్లిగా బయలుదేరింది. అమ్మ ఆప్యాయంగా వెన్నుచరచింది.

వేదికమీద పాదం పెట్టగానే వళ్ళంతా చిరుచెమటలు పూసింది. మెల్లిగా శ్రీ త్యాగరాజు పటానికి, సభికులకు నమస్కరించింది.

మొదటిసారిగా విఘ్నేశ్వర ప్రార్థన చేసి, వరుసగా శంకరాభరణం, కళ్యాణి, ఇందోళం - వర్ణం కీర్తనలుపాడి, 'శ్రీ' రాగాలాపన, గానం పూర్తి చేసేసరికి పందిరి కరతాళధ్వనులతో మారు మ్రోగిపోయింది. ప్రార్థనతో మొదట్లో వణికిన కంఠం సప్తస్వరాలకు జీవంపోసింది. మరొకసారి సభికులకు నమస్కరించి లేచిమెల్లిగా మాష్టారువంక చూచేసరికి ఆయనముఖంలో సంతృప్తి, సంతోషం తొణికిసలాడుతున్నాయి. చిరునవ్వుతోపాటు ఒక గర్వ వీచిక కూడా కదలాడింది.

ఇంటికి రాగానే అమ్మ గబగబా లోపలకు తీసుకెళ్ళి దిష్టి తీసింది. నాన్నకు పరిచయమున్నవాళ్ళు తన పాట విని ఎంత మెచ్చుకున్నారో చెప్పుకుని పొంగి పోతూండేవారు.

తెలుగులో మరి కే
రచయిత కన్న సమాజాన్ని
ఎక్స్‌రే తీసినంత స్పష్టంగా
చూపగా, ఇతివృత్త
వైవిధ్యంతో చూపగల
రావి శ్రీమన్నారాయణ
సరికొత్త నవల
ప్రతి నవలకు మది ప్పేరు
ఇవ్వలేని 6 రంగుల ముఖచిత్రం
ఒక్కో నవల వెల రు. 5/-

హసీనమ్మా
మహామేధావి
నిష్ఠలాట
ఎందరో భక్తులు!
లేడీ టైపిస్టు

పాఠకులకు
ప్రత్యేక తగ్గింపు ధర!
వి.పి పోస్టేజీతో సహా ఏ
నవలయినా రు. 4/- కోరు
కున్న ఏ 3 నవలలయినా
రు. 10/-లు మాత్రమే!
నేడే వ్రాయండి!

ప్రతాప్ పబ్లికేషన్స్
* విజయవాడ-4.

ఆ తరువాత మాష్టారి ప్రోద్బలం మీదనే ఆల్ ఇండియా రేడియోకురాసి వాయిస్ టెస్టుయిచ్చి వచ్చింది.

మొదట్లో అప్పుడప్పుడు రేడియోలో పాడటం మొదలుపెట్టిన కొద్ది నెలలకే రకరకాల వాటిలో పాడే అవకాశం కల్గింది. సంగీత రూపకాలలో_ భక్తిరంజని_

తను మొదటిసారి రేడియోలో పాడినందుకే వాళ్ళు పంపిన చెక్కును చూడగానే ఏదో తెలియని సంతోషంలో మునిగిపోయింది. ఆక్షణంలో ఏదో గర్వం ఆనందం తనని నిలువనీయకుండా చేశాయి. ఆ డబ్బును ఏం చేయాలా అని రోజుల తరబడి ఆలోచించి చివరకు తీసుకువెళ్ళి నాన్నకు యిచ్చింది.

ఒక్క నిముషం ఆశ్చర్యపోయి ఆప్యాయంగా తలనిమిరారు. ఏడాది తిరగకుండా ఆల్ ఇండియా రేడియోలో పర్మనెంటు ఆర్టిస్టుగా చేయడంతో తరచుగా పాడేఅవకాశం వచ్చేది. దాదాపు ప్రతిసారి ఆ డబ్బు తండ్రికిచ్చినా ఆయనది కానివాడ లేదన్న సంగతి తెలుసుకున్న రోజు ఎంతో ఆశ్చర్యపోయింది.

ఓరోజు ఒకపెద్ద అట్ట పెట్టెను రిక్షాలో పెట్టుకు దిగిన నాన్నను చూచి గబగబా గుమ్మం దగ్గరకు వెళ్లారు తనూ అమ్మా.

పెట్టిలోంచి తీసి పెద్ద రేడియోను బల్ల మీద పెట్టారు నాన్న. తనకు ఎన్నాళ్ళ నుండో రేడియో వుంటే బావుండునన్న కోరిక ఆరోజు తీరడంతో సంతోషంగా తండ్రి వంక చూచింది. "నాదేం లేదమ్మా- యిదంతా నీస్వార్జితమే! అన్నారు చిరునవ్వుతో.

తనకు తెలియకుండానే కళ్ళంబడి నీళ్ళు కారిపోయాయి,

పద్నాలుగేళ్ళు దాటినప్పటి నుండి అమ్మ గొడవచేస్తున్నా ఆట్టే శ్రద్ధ పట్టించుకోని నాన్న ఆ సంవత్సరం గట్టిగా పెళ్ళి ప్రయత్నాలు చేశారు.

పెళ్ళి చూపులకొచ్చిన రోజు తను పాట పాడుతూవుంటే ఆసక్తిగా వింటున్న పెళ్ళి కొడుకును చూచి ఎంతో తేలికగా నిట్టూర్చింది. అదేమిటో కొందరికి సంగీత మంటేనే చిరాకు, హాయి ఓ్‌ అంటూ సినిమాపాట లెన్నయినా వినగలరుగాని.

పెళ్ళి నిర్ణయం అయినరోజు అమ్మా నాన్నకు నిద్రలేకపోయింది. ముందు జరగబోయే శుభకార్యానికి సంబంధించిన ఆలోచనలతోనే గడిచిపోయింది. కాని తనకు మాత్రం ఏదో భయం. అతనిది కూడా యీ వూరే కాబట్టి వూరువిడిచి వెళ్ళక్కరలేదు. కాని తను పల్లెకగా పాడటం వాళ్ళందరికి యిష్టం వుంటుందో లేదో.... అందరి సంగతి తరువాత, ముందు అతనివి ఎలాంటి భావాలో....

అదే భయంతో అమ్మతో మొరపెట్టుకుంది.

"నీ కన్నీ పిచ్చిభయాలే! సంగీతానికి అభ్యంతరం ఏమిటి? యిదేం నాటకాలాడమా, డాన్సులు చేయడమా. అయినా నాన్నను రాని చెబ్దాం "అంది అమ్మ.

"పెళ్ళయ్యాక కచేరీలకు వాటికి వీలుంటుందో లేదో అని దిగులు పడుతోంది మీ అమ్మాయి. వాళ్ళకేమన్నా అభ్యంతర్య వుంటుందేమో కనుక్కోమంటోంది". చెప్పింది అమ్మ నాన్న ఇంటికి రాంగానే!

ఫెళ్ళున నవ్వారు. అబ్బాయి ఎంత మెచ్చుకున్నాడో తెలుసా, పెళ్ళిచూపుల రోజు. మీకు మరీ పిచ్చిఆలోచనలు. దాని అదృష్టం బావుంది. మంచి సంబంధం దొరికింది.... రత్నంలాంటి పిల్లవాడు. పర్మనెంటు వుద్యోగం...." నాన్న ధోరణి సాగిపోయింది, తన ఆలోచనా స్రవంతిలాగానే!

పెళ్ళయిపోయింది. తను అత్తవారింటికి వచ్చేసింది.

ఓ రోజు మధ్యాహ్నం నాన్న వచ్చారు స్కూలుకువెడుతూ తనకు వచ్చిన వుత్తరాన్ని తీసుకుని.

రేడియో స్టేషన్‌నుండి వచ్చే వుత్తరాలన్నీ ఇంగ్లీషులోనే వుంటాయి. అందుకే తనకు వళ్ళుమంట. నాన్న చదివి చెప్పారు. వాసవదత్త సంగీత రూపకంలో తనకి పోర్షను ఇచ్చారని ఇంకో వారంలో రిహార్సల్స్ మొదలవుతాయనీను. తనకెంతో సంతోషమయింది, పెళ్ళయ్యాక ఇదే మొదటి ప్రోగ్రాం, ఎప్పుడు నాన్న తీసుకువెళ్ళేవారు. ఇకనుండి యీయన తీసుకువెళ్తారు.


ఆ సాయంత్రందాకా ఏ రోజూ ఎదురు చూడనంతగా ఎదురుచూచింది భర్తకోసం. రాత్రి గదిలోకి వెళ్ళంగానే కవరు చేతి కందించింది. ఆయనేదో వుత్సాహంగా, ప్రోత్సాహమిస్తూ మాట్లాడుతారని ఎదురు చూచిన తనకు ఆయన మామూలుగా చదివి కవరులో పెట్టేస్తుంటే, ఎంతో నిరుత్సాహ మనిపించింది.

అయినా కప్పిపుచ్చుకుని యింక కొద్ది రోజులు మీకు పని తప్పదు" అంది నవ్వ తెచ్చుకుంటూ.

"ఏం?"

"నన్ను రిహార్సల్స్‌కీ, దానికి మీరే తీసుకెళ్ళాలి. యిన్నాళ్లూ మా నాన్న తీసుకు వెళ్ళారు. ఇకనుంచి మీది బాధ్యత." అంది అతని వంకచూస్తూ.

కవరుమీద ఎడ్రసువైపుకు చూస్తూదించు కుని 'మా అమ్మ వాళ్ళతో చెప్పావా?"



అవి అడిగారు మెల్లిగా.

"లేదు. మీరు చెప్పండి."

వాళ్ళకు యిలాటి వాటికి యిష్టం వుండదనుకుంటాను" అన్నారు మెల్లిగా.

"ఏం?" అంది తెల్లబోతూ....

"ఏంలేదు...." మాట మింగేశారు.

"ఇందులో తప్పేముంది? మీరు తీసుకు వెడుదురుగాని. తిరిగి కలిసే వచ్చేయచ్చు. ఎక్కువసేపు కూడా పట్టదు."

"అదికాదు పద్మా...! ఆగిపోయారుఏం చెప్పాలో అర్థంకాక.

ఆ రాత్రంతా నిద్రపట్టలేదు తనకు, నిజంగా మామగారు, అత్త గారూ అడ్డుపెడితే యీయనేమీ సరిచెప్పరా? నాకు సంగీతమంటే యిష్టం. నీ పాటవినే పెళ్లి చేసుకున్నానన్నారు.... కాని.... పెళ్ళికాక ముందు కలిగిన సందేహమే యిపుడోసమస్య అయినిలచింది.

మర్నాడు అత్తగారితో మాట్లాడారు. "అమ్మకు ఇష్టంగాలేదు. రిహార్సల్స్‌కి వాటికి పగలు రాత్రి లేకుండా తిరగటం, మగవాళ్లతో పాడటం బావుండదంటోంది." అన్నారు మెల్లిగా,

"ఇందులో అభ్యంత రానికేముంది. ఇచేంపబ్లిగ్గా పదిమంది మధ్య కచేరిలాంటిది కూడా కాదు. ఓ గదిలో మైకు ముందు పాడ టానికి కూడా అభ్యంతరమేముంది?" అప్పటికే తన కళ్లనిండానీళ్లు నిండుకున్నాయి. మరొక్క మాటచాలు కారి ప్రవహించడానికి.

"నీకు, నాకు అది తప్పుగా కనిపించకపోవచ్చు. పాతవాళ్లు వాళ్లకు అభ్యంతరం లేకుండా ఎలా వుంటుంది?"

"మీరు సర్దిచెప్పలేరా?" తన కంఠంలో ధ్వని తనకే విచిత్రంగా తోచింది.

"సర్దిచెప్పగలిగేది లేనిది తరువాత విషయం. ఇంత చిన్న విషయంలో కూడా వాళ్లకు ఎదురుచెప్పడం, వాదించుకోవడం ఏం బాగుంటుంది చెప్పు." అన్నారు. లాలనగా.

చిన్న విషయమా! వెర్రిగా చూసింది అతనివంక. యిక మాట్లాడేందుకు ఏమీ లేదనిపించి మెల్లిగా ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. వెనుకనుంచి వెలువడిన సుదీర్ఘమయిన నిట్టూర్పు చెవులనుదాటి మనసుకు చేరింది.

ఆ రాత్రి మౌనంగావున్న తననిచూస్తే ఏమనిపించిందో, "పద్మా' అని పిలచారు. ప్రేమ ఆప్యాయత గుప్పపోసి, అడుగునుండి తవ్వి తీస్తున్నట్టు. ఎటువంటి చలనం లేని తననిచూచి, అంత బాధపడవలసిన విషయమా చెప్పు. ఇలా ప్రతి చిన్న విషయానికి బాధపడుతూంటె ఎలా?

తన బాధ ఆయనకు ఎలా అర్థమవుతుంది? సంగీతానికీ తనకీ మధ్యవున్న బంధం మరొకరు ఎలా తెలుసుకోగలరు? ఏమని చెప్తుంది. పెళ్ళయి గట్టిగా పది రోజులుగాని భర్తకు.

మౌనంగా కూర్చున్న తనతో ఆయనే ఎన్నోఎన్నోమాట్లాడారు. ఏ ఒక్కవిషయం మనసును స్పందించ లేకపోయింది.

సంగీతం అంటే నీకు యిష్టముంది. నేర్చుకున్నావు. కష్టపడి సాధించావు. దాన్ని పదిమందిలో పాడలేక పోయినంత మాత్రాన యింత అసంతృప్తిగా ఎందుకు ఫీలవ్వాలి?" అన్నారు.

పాట నేర్చుకున్నది పదిమందిముందు పాడాలని కాకపోయినా అందరిలో పాడి, ఒక గంటసేపు ఆనందం కలిగించినప్పుడు కలిగే తృప్తికి నిర్వచన మేముంది? తన భావాలు ఏమని విడమర్చి చెప్తుంది?

"కథలు రాయగలను కాబట్టి రాస్తున్నాను. అని రాసినవన్ని పెట్టెలో పెట్టి తాళం వెసుకుంటే అది సమంజసమే

నంటూరా?" అడిగింది నిస్సంకోచంగా.

"........"మౌనంగా చూశారు.

"ఒక పాత్ర పోషించి ఆ పాత్రనై గానంలో నిలిచినప్పుడు కలిగే సంతృప్తి తెలియని రాగం నేర్చుకని అందులో తన్మయం అవగలిగిననాడు కలిగే ఆనందం యివన్నీ మీకు అర్థంకానివని నన్ను చెప్పమన్నారా?" తనలో ఎప్పుడూ లేని ఆవేశం పొంగుకువారింది.

నిశ్శబ్దంగా నిట్టూరుస్తున్న భర్తను చూచి, మౌనంగా మంచంమీద వాలింది. మనసులో చెలరేగే భావోద్వేగాలు కన్నీళ్ళయి కట్టలు తెంచుకున్నాయి.

తను పాల్గొనడానికి వీలేదని ఎ. ఐ. ఆర్. కు ఉత్తరం రాసి పడేసిన రోజు తననుభవించిన బాధ ఎన్నటికి మర్చిపోలేదు. ప్రతిరోజు తెల్లవారు ఝామున అయిదుగంటలకు ఠక్కున మెలకువ వచ్చేది. కొన్నేళ్ళుగా సంగీత సాధనకు అలవాటుపడ్డ సమయం నిద్రలో గడపడం తనకు చేతనయిన పనికాదు. మెలకువతో లేవంగానే చుట్టూవుండే దృశ్యాలు తన సాధనకు అడ్డు తగులుతాయి. ఆదమరచి హాయిగా నిద్రిస్తున్న భర్త. పక్కగదిలో మరిది, ఆడబడుచు, అత్తగారు. యింత మంది మధ్య తను ఒక్కతే లేచి ఏం పాడుకుంటుంది. యింకా సాధన చేసి, చేసి ఏం సాధించాలి.

తన పుట్టింటోనయితే వేరు. యీపాటికి అమ్మా నాన్న లేచిపోతారు. తను పాడుకుంటూంటే ఒక్కొక్కప్పుడు కూర్చుని వినేవారు నాన్న. అమ్మ పని చేసుకుంటూనే వింటూండేది....యిక్కడ అలా కాదు. ఎవ్వరికీ ఏడుగంటలు కాందే లేచే అలవాటు లేదు. తన సాధనకు సమయం కాదు. గాఢంగా నిట్టూర్పు విడవకుండా వుండలేకపోయింది.

కనీసం రేడియో వస్తే విని ఆనందించే అవకాశం కూడా తగ్గిపోయిందనిపించింది. మరిది ఆడబిడ్డ యింట్లో వున్నంతకాలం వివిధ భారతి, సిలోన్ తప్ప యింకొకటి వినరు. అత్తగారికి వనితావాణి మామగారికి వార్తలు ...అదేమిటో తన భర్తకు ఏ ఒక్క విషయం పట్టదు అనుకునేది మొదట్లో. పొద్దున నిద్ర లేవడం, పేపరు చదవడం, భోజనం చేసి ఆఫీసుకు పోవడం, సాయంత్రం ఇంటికొచ్చి కాసేపు అవి యివి చూడటం.... ఎంత తృప్తయిన జీవితం అనిపించేది.

కాని తనకో.... అంతా అసంతృప్తే. ఒక్కసారి అలా ఆలోచించుకుంటూ వుండిపోయేది. తను ఏం చూచి అశాంతిగా బాధపడాలి? ప్రాణమిచ్చే భర్త- పాలకుండ వంటి కాపురం.... ఆలోచనా స్రవంతికి అడ్డులేకపోయినా, కావలసిన సమాధానం లేదు.

ఏముంది? ఎవరు తృప్తిగా వున్నా, ఒకరు అసంతృప్తిగావున్నా, నడిచేకాలం ఎప్పుడూ ఆగదు అనుకుంటుంది తన యిద్దరి పిల్లల్ని చూచి. పోనీ పాపకయినా సంగీతంమీద శ్రద్ధ వుంటే చక్కగా నేర్చుకుని....పెద్ద విద్వాంసురాలై .... తన ఆలోచనకు తనకే నవ్వు వచ్చేది. ఎందుకీ వూహాగానం. వాస్తవంలో వున్న తన

---

● రైల్వే లెవెల్ క్రాసింగ్ దగ్గరకు చేరుకున్న ఒక అతిజాగ్రత్త మూర్తిగారు తన ఎనిమిదిమంది పిల్లల్నీ, భార్యనూ 'నేనొచ్చేవరకూ కదలొద్దు' అని ఆజ్ఞాపించి ఆ రైలుపట్టాపక్కనే మైలుదూరం నడిచి స్టేషనుకు చేరుకుని స్టేషను మాష్టారుతో "అయ్యా ఉత్తరం వెళ్ళేబండి ఎన్నిగంటలకు?" అని అడిగాడు.

'ఇప్పుడు లేదు మధ్యాహ్నం మూడుగంటలకు' అన్నాడు స్టేషన్‌మాష్టరు.

"మరి దక్షిణం వెళ్ళేబండి?"

అదీ యిప్పుడులేదు. రాత్రి ఎనిమిది గంటలగ్గానీ రాదు.

'అయితే సరే' అని సకుటుంబరావు త్వరత్వరగా లెవెల్ క్రాసింగ్ దగ్గరకువెళ్ళి నవ్వుతూ ఇప్పుడు మనం నిక్షేపంగా పట్టాలు దాటవచ్చు. అన్నాడు.

కోరిక తీరలేదు. యింకా పాడే తన్ను నిండని పసిదానిమీద ఆలోచన ..


పెరిగే ధరలు ... తరగని ఖర్చులు చూచినప్పుడల్లా తనకి ఒకటే బాధ. చేతిలో విద్య వుంది. దానికి గుర్తింపు కూడా వుంది. కాని వుపయోగపరచుకునే అవకాశమే లేకపోయింది తనకు. యీపాటికి తను ఆల్ ఇండియా రేడియోకి వెడుతూంటె తప్పకుండా వుద్యోగమొచ్చి వుండేది. యిక అనుకుని ప్రయోజనమేమిటి?

ఆ మాటే అంది వొక్కసారి భర్తతో "కనీసం పిల్లల అవసరాలకయినా వుండేది డబ్బు. ఇటు నా ఆనందాన్ని, అవకాశాన్ని రెండూ పాడుచేశారు" అంది ఏడ్చుతూ.

తన మాటలలో సమంజసం తోచిన ఆయన ఏమీ మాట్లాడకుండా వూరుకున్నారు. ఆయనకు మాత్రం తెలియదు. డబ్బు విషయం ఎలా వున్నా- యిన్నేళ్ళ నుండి తన మనసులో చెలరేగుతున్న అశాంతి, అన్నివిధాలా లక్షణంగా వున్నా, ఆనందించలేని తనని గురించి ఆయనకు తెలియకపోతే యింకెవరికి తెలుస్తుంది? బలంగా నిట్టూర్చింది.

ఓ రోజు అడిగారు ఎంతో ఆలోచించి అడిగినట్లు.... నీకు రేడియోలో పాడలేకపోయినందుకు, కచేరీలు ఆగినందుకు బాధ యిప్పటికీ పోలేదుకదూ! ఏ ప్రశ్న- ఏం చెప్తుంది తను? తను ఆ అవకాశానికి ఎంత కృషి చేసింది? చివరకు ఏమయింది? తన కృషికో గుర్తింపు లేక - తన ఆశలకు ఆలంబనలేక అన్నీ రాలిపోయాక కలిగిన బాధ తననెలా విడిచిపోతుంది? ఏం చెప్తుంది తను?

"పోనీ మళ్ళీ నువ్వే వొక వుత్తరం రాయకూడదూ! మళ్ళీ నీకు అవకాశం వస్తుందేమో!




ఆశ్చర్యపోయి చూచింది. ఆశ్చర్యం కాదూ! ఈ మాటలు ఆయన నుండి రావాలని ఎంతకాలం ఎదురు చూచింది. తన చూపుల్లో భావాలు అర్థం చేసుకున్నట్లు.

"నిజమే పద్మా నీ సరదా తీరలేదు. యిట్లు అవకాశమూ పోయింది. మా మూర్ఖత్వం వల్ల, నీ కోరికలు నెరవేర్చలేకపోగా, నీ అంతట నువ్వు తీర్చుకునే శక్తి కూడా ఎందుకు పోగొట్టాలి చెప్పు. అసలు లేనిదానికంటే- ఆలస్యంగా గుర్తించినా మంచిదేమో! మళ్ళీ ప్రయత్నం చెయ్యి."

"మీ అమ్మగారూ, నాన్నగారూ....?"

"వాళ్ళ అడ్డుపెడతారు. నేను సర్ది చెప్తాను."

ఆ క్షణంలో తనలో వెలిగిన కాంతి, ఆయన కళ్ళల్లో ప్రతిబింబించింది.

ఆల్ ఇండియా రేడియోకు వుత్తరం రాసి పోస్టుచేసిన రోజు తన భావాలు లతలలా అల్లుకుపోయాయి. ఈ రోజుకోసం కాదూ! తను నిరీక్షించింది. తను మళ్ళీ పదిమందితో కలసి.... తన గానాన్ని పంచిపెట్టగలదు. తన పాటలో లీనమయి బ్రతుకంతా వెన్నెల కురుస్తూంటె — చిన్ననాడు నేర్చుకున్న గానంతో తన కోరికలు తీర్చుకుని జీవితమంతా నందనవనం చేసుకోగలదు.

ఆలోచనల ప్రవాహంలో కొట్టుకుపోతున్న పద్మావతికి పోస్టుమాన్ వచ్చిందీ, కిటికీలోంచి ముందు గదిలోకి వుత్తరాలు పడేసిందీ కూడా తెలియలేదు. పడుకున్న పిల్లవాడు లేచి ఏడ్చేసరికి వులిక్కిపడి, బాబు నెత్తుకుని ముందు గదిలోకి వచ్చింది.

క్రింద పడివున్న వుత్తరాలు తీసుకుని తనకి కావాల్సిన దానికి ఆత్రుతగా వెతి

కింది. పరిచయమైన ముద్రతో ఎదురు చూచిన వుత్తరం వచ్చేసరికి ముఖం ఆనందంతో వెల్లివిరిసింది.

గబగబా వుత్తరం చింపి చదవబోయి - వెధవ ఇంగ్లీషు అర్థమయి చావదు, అనుకుంది విసుగ్గా - ఆ పాటకోసమే కదా! తన చదువు, సమయం అన్నీ వెచ్చించింది అనుకుంది నిట్టూరుస్తూ.

సాయంత్రం వరకు భర్తకోసం ఎదురు చూచిన పద్మకు క్షణాలు గంటల్లా తోచి విసుగ్గా యిల్లంతా కలియతిరగ సాగింది.

మధుసూదనం యింటికి రాగానే వుత్తరం తీసుకువెళ్ళి యిచ్చింది. భార్యముఖంలో వుత్సాహాన్ని చూచి నవ్వుకుంటూ కవరు విప్పాడు.



"ఏం రాశారు?" ఆ వాక్కు సమాధానంమీద తన బ్రతుకు అంతా ఆధారపడి వున్నంత ఆందోళనగా.

ఒక నిముషం తటపటాయించాడు మధుసూదనం. భార్య ముఖంలో చూస్తూ "నిన్ను వాయిస్ టెస్టుకు రమ్మనమని రాశారు."

నిశ్చలంగా చూచింది పద్మ. ఊహకు మరేమీ అందనట్లు.

"ఆ ఇదంతా రెగ్యులర్ ఫార్మాలిటీస్. నీ వాయిస్‌కేం. ఏమీ మారలేదు" సమాధాన పరచబోయాడు.

ఎందుకో అర్థంకాని ఆవేదన కలిగింది పద్మలో. ఏదో తెలియని భయం ఆవరించింది. తను ఎందుకు భయపడాలి? ప్రశ్నించుకుంది పదే - పదే! ఇదివరకు వెళ్లలేదూ! ఇప్పుడూ అంతే! ఏదో పాడిస్తారు. మాట్లాడిస్తారు.

కాని అప్పుడూ, ఇప్పుడూ ఒకటెలా అవుతుంది? ఒకవేళ తనా టెస్ట్‌లో పాస్ కాలేకపోతే - తన అభిమానానికే సవాలు! తన కోరికలన్నీ చంపుకునయినా బ్రతకగలదు - కాని తన అభిమానం....?

తను పాట పాడటానికి పనికిరాదన్న నిజాన్ని తను వినాల్సివస్తే?

తను అంగీకరించలేని ఓటమే ఎదురయితే? పరాజయాన్ని అంగీకరించి మాత్రం బ్రతకలేదు. కటిక చేదు లాంటి నిజాన్ని వినడం కంటే. ఆ పరిస్థితి తెచ్చుకోకుండా వుండటం నయం కదూ! అవునూ, కాదూ అన్న మీమాంసలో వూగిసలాడి - "కాదూ" అన్న వాస్తవాన్ని ఎదుర్కొనవలసి వస్తే, ఆ నిజాన్ని తను మ్రింగమింగి బతకగలదా? తన ఆశయాలకు ఆశలకు అడ్డుగా నిలచి తనకే అసమర్థతన్ని చెప్పే నిజాన్ని వెతికే ప్రయత్నం, ఏ మాత్రం తను చేయదు.

నిరాశతోనయినా బ్రతకగలదేమో!

చేదులాంట నిజాన్ని మాత్రం ఎదుర్కొనలేదు.

....అయినా తను పాస్ అవదని ఎందుకనుకోవాలి?

సంగీతం తన ధ్యేయం, తన జీవితం! ఆదరించేవాళ్లున్నా - అభిమానించేవాళ్లు లేకున్నా ఆ గానంలో తను అన్నీ మరిచిపోగలదు.

కాని ఆ గానానికే తను పనికి రాదనుకుంటే - అంతకంటే అఘాతం వుందా?

లేదు వినకా శక్తిలేదు. నిజాన్ని వినే శక్తి లేదు. వూహల్లోనయినా బ్రతక గలదేమోగాని, వాస్తవంలో చేదును భరించలేదు.

కళ్లవెంబడి నీళ్లు మెత్తగా బుగ్గల మీదుగా జారిపోయాయి.

ఒకసారి చేతిలో వున్న వుత్తరం వంక పైనుంచి క్రిందదాకా చూచి, ముక్కలు ముక్కలుగా చింపి కిటికీలోంచి బయటకు పారేసింది. గాలిలో ఎగిరిపోయాయి ముక్కలు, రాలిపోయిన కోరికలలాగా, తెగిపోయిన తీగల్లాగా. కిటికీ చువ్వల నానుకుని బయటకు చూస్తూ వున్న పద్మావతినుండి వెలువడుతున్న నిట్టూర్పులు సెగలలాగా, పొగలలాగా తేలిపోయాయి.

భార్య ముఖంలోని భావాలు చదవబోయిన మధుసూదనం ఆశ్చర్యంగా చూచి, నిర్లిప్తంగా నిట్టూర్చాడు.

□□□

---

● డాక్టరు ఆరోగ్యంగారు గదిలోకి వచ్చి రాగానే రోగినిచూసి "విశాలంగా" నవ్వుతూ, "మీరివ్వాళ చాలా హుషారుగా ఉన్నారే" అన్నాడు.

రోగి "ఏముంది? మీరిచ్చిన మందు సీసామీది సూచనలు తు. చ. తప్పకుండా పాటించాను" అన్నాడు.

డాక్టరు "ఏమిటవి?" అన్నాడు.

మామూలే: సీసామీద "మూత గట్టిగా పెట్టండి" అనివుంది అదే చేశాను" అన్నాడు రోగి.